ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 36.0 | కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5





వనపర్తి జిల్లా ఆత్మకూరులో
మంగళవారం అన్‌లోడ్ అవుతున్న సన్నబియ్యం

సార్ల కోసం..

- మెజారిటీ నియోజకవర్గాల్లో ప్రారంభం కాని సన్న బియ్యం పథకం
- ఎమ్మెల్యేలు ప్రారంభిస్తేనే పంపిణీ చేస్తామంటున్న అధికారులు
- ఇంకా చాలా దుకాణాలకు చేరని బియ్యం..
- నేడు చాలా నియోజకవర్గాల్లో పంపిణీ..
- రేషన్ అక్రమాలకు చెక్ పడినట్లేనా?



నారాయణపేట జిల్లా కేంద్రంలో సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసే పథకాన్ని ఉగాది రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ వేదికగా ప్రారంభించారు. ఇక నుంచి తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆ రోజు, ఆ తర్వాత రోజు సెలవులు ఉండటం, మంగళవారం రోజు ఎమ్మెల్యేలు అందుకు అనుగుణంగా కార్యక్రమ ఏర్పాట్లు చేసుకోకపోవడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని చోట్ల పథకం ప్రారంభం కాలేదు. బియ్యం కూడా అన్ని దుకాణాలకు ఇంకా సరఫరా కాలేదు. ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తారు. ఆలోపే డీలర్ల నుంచి ఇండెంట్ తీసుకుని.. బియ్యం సరఫరా చేస్తారు. సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభం కంటే ముందే అన్ని దుకాణాలకు బియ్యం తరలించాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ ఇప్పటిరకు దుకాణాలకు తరలింపు పూర్తి కాలేదు. కొన్ని మండలాలకు అసలే వెళ్లలేదు. ఇంకా రెండు మూడు రోజుల సమయం సరఫరాకే సరిపోతుందని అంటున్నారు. గతంలో ప్రభుత్వం ఏదైనా కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నప్పుడు అధికారులు దానికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేసుకునే వారు. కానీ ప్రస్తుతం సీఎం పథకం ప్రారంభించినా.. జిల్లా స్థాయిల్లో మాత్రం సరఫరా పూర్తికాకపోడం గమనార్హం. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నారాయణపేట, జడ్చర్ల, గద్వాల తదితర నియోజకవర్గాల్లో మాత్రమే మంగళవారం పంపిణీ ప్రారంభం ప్రారంభమైంది. మెజారిటీ నియోజకవర్గాల్లో ప్రారంభం కాలేదు. అందుకు కారణం బియ్యం అన్ని దుకాణాలకు చేరకపోడం ఒకటైతే.. ఎమ్మెల్యేలు పథకం ప్రారంభానికి అనుగుణంగా కార్యక్రమాలు పెట్టుకోకపోవడం మరో కారణంగా చెప్పొచ్చు. మంగళవారం నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తారని దుకాణాలకు వచ్చిన లబ్ధిదారులు.. పంపిణీ లేదని చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు.

జిల్లాల వారీగా రేషన్ బియ్యం పంపిణీ వివరాలు

జిల్లా	కార్డులు	లబ్ధిదారులు	బియ్యం (మెట్రిక్ టన్నుల్లో..)
మహబూబ్‌నగర్	239514	789790	5085
నారాయణపేట	140322	508486	3217
జోగులాంబ గద్వాల	160106	545813	3461
వనపర్తి	157100	516194	3097
నాగర్‌కర్నూల్	237821	750241	4819

ఎమ్మెల్యేలు లేకనే..

సాధారణంగా సీఎం పథకం ప్రారంభించిన రోజే.. రాష్ట్రవ్యాప్తంగా ఈ పంపిణీ ప్రారంభం కావాలి. కానీ ఆ రోజు ఉగాది, తర్వాత రోజు రంజాన్ సెలవులు ఉండటంతో పంపిణీ ప్రారంభం కాలేదు. ఎమ్మెల్యేలు కూడా వేడుకల్లో పాల్గొంటూ బిజీబిజీగా గడిపారు. మంగళవారమైనా పథకం ప్రారంభం కావాల్సి ఉండగా, ఎమ్మెల్యేలు అసలు కార్యక్రమాలు పెట్టుకోలేదు. మెజారిటీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో అందుబాటులో లేకపోవడంతో పంపిణీ మొదలు కాలేదు. అధికారులను పంపిణీ ఏదని అడిగితే ఎమ్మెల్యేలు ప్రారంభించిన తర్వాతనే పంపిణీ చేస్తామని చెబుతుండటం గమనార్హం. ప్రభుత్వానికి, పార్టీకి, ప్రజలకు మేలు చేసే పథకం విషయంలో ఇంత నిర్లిప్తతపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. నియోజకవర్గంలో లాంఛనంగా ఒకచోటైనా ప్రారంభిస్తే.. మిగతా చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులు లేదా అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తే సరిపోతుంది కదా? అని ప్రశ్నిస్తున్నారు. నారాయణపేట, జడ్చర్ల నియోజకవర్గాల్లో మంగళవారం పథకం ప్రారంభం కాగా.. మిగతా అన్ని నియోజకవర్గాల్లో బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. అయితే పూర్తి స్థాయిలో సన్న బియ్యం దుకాణాలకు సరఫరా కావడానికి మరో ఐదు రోజులు పడుతుందని చెబుతున్నారు.



సన్న బియ్యం

రేషన్ అక్రమాలకు చెక్ పడినట్లేనా?

ప్రభుత్వం పీడీఎస్ బియ్యం పంపిణీ ప్రారంభించిన నాటి నుంచి ఏదో ఒక రూపంలో అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రతీ నెలా పీడీఎస్ బియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ.. దొడ్డు బియ్యం కావడంతో తినేవారి సంఖ్య తక్కువగా ఉంటోంది. కొందరు ఇళ్లకు తీసుకువచ్చి.. సంవత్సరానికి రెండుసార్లు విక్రయిస్తుండగా, కొందరు రేషన్ దుకాణాల్లోనే తంబ్ వేసిన తర్వాత బియ్యం తీసుకోకుండా డబ్బులు తీసుకుని వెళ్తున్నారు. కిలో బియ్యానికి రూ.10 వరకు ఇస్తున్నారు. కేవలం లబ్ధిదారులు దొడ్డు బియ్యం తినడానికి ఇష్టపడకపోవడం వల్లనే ఈ అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పొచ్చు. సన్న బియ్యం అందరికీ పంపిణీ ప్రారంభించిన తర్వాత వాటిని ప్రతీ ఒక్కరూ తినే అవకాశం ఉంది. అప్పుడు రేషన్ బియ్యం అక్రమాలు తగ్గుతాయని, సంక్షేమం అప్పుడే కచ్చితంగా లబ్ధిదారులకు అందినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

వేసవి క్రీడా శిబిరాలకు సన్నాహాలు

- వచ్చే నెల 1 నుంచి ప్రారంభం
- నెల రోజుల పాటు వివిధ ఆటల్లో శిక్షణ
- మండలానికి ఒక శిబిరం ఏర్పాటు
- శిక్షకులకు నెలకు రూ.4,000 గౌరవ వేతనం..
- ఆటల కిట్లకు ప్రత్యేక నిధులు
- పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉపయోగకరం



నారాయణపేట మైదానంలో రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు(ఫైల్)



నారాయణపేట మైదానంలో
కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

నారాయణపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సెలవులు సద్వినియోగం అయ్యేలా, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు వెలికి తీసేలా ప్రభుత్వం మే 1 నుంచి నెల రోజుల పాటు ఈ శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) నుంచి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. అందులో భాగంగా శిక్షకుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్ తదితర అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షణలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో శిబిరాలు కొనసాగనున్నాయి. శిక్షకులకు రూ.4,000 గౌరవ వేతనంతో పాటు శిక్షణకు కావల్సిన సామగ్రి, ప్రథమ చికిత్స కిట్లకు ప్రత్యేక నిధులను ఇవ్వనున్నారు. శిబిరాలు ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు కొనసాగనున్నాయి. ఆర్థిక స్థోమత లేని పేద, మధ్య తరగతి విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు శిబిరాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.



బంతి బంతికీ ఓ లెక్క!

- ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న యువత
- సొంతంగా యాప్‌లను క్రియేట్ చేసుకున్న నిర్వాహకులు
- టీకొట్లు, హోటళ్లు, లాడ్జింగులే అడ్డాలు

7

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

- స్పందించిన నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్
- క్షతగాత్రులను పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలింపు


7

ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనకు 40 రోజులు

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- తవ్వకాల్లో బయట పడుతున్న టీబీఎం విడిభాగాలు
- కన్వేయర్ బెల్ట్ 100 మీటర్లు పొడిగింపునకు చర్యలు
- నేడు పరిశీలించనున్న మంత్రి పొంగులేటి



శిథిలాలను లోకో ట్రైన్‌పై వేస్తున్న సిబ్బంది



టన్నెల్ లోపల కన్వేయర్ బెల్టు పునరుద్ధరణకు చేస్తున్న ఏర్పాట్లు

దోమలపెంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ప్రమాద ఘటన జరిగి నేటికీ 40 రోజులు అవుతోంది. కోట్ల విలువ చేసే టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ధ్వంసం కావడంతో పాటు 8 మంది కార్మికులు గల్లంతయ్యారు. అందులో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగతా ఆరుగురి ఆచూకి కోసం సొరంగంలో రెస్క్యూ బృందాలు తవ్వకాలు కొనసాగిస్తున్నాయి. ఈ తవ్వకాలలో టీ బీఎం విడిభాగాలు టన్నుల కొద్ది బయట పడుతున్నాయి. క్రమక్రమంగా శిథిలాలను తొలగించకుంటూ సొరంగం పనుల్లో రెస్క్యూ బృందాలు ముందుకు సాగుతున్నాయి.

టన్నుల కొద్దీ బయట పడుతున్న విడిభాగాలు

శిథిలాలను తొలగించేందుకు జరుగుతున్న సహాయ చర్యలకు అడుగడుగునా టీబీఎం విడిభాగాలు అడ్డుగా వస్తున్నాయి. తవ్వేకొద్ది టన్నులు కొద్ది ఇనుప గడ్డర్లు, పైపులు బయట పడుతున్నాయి. దీంతో పాటు టీబీఎంకు సంబంధించిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మిషన్ ప్లేట్లు, కంప్రెషర్లు, స్టక్టర్ తదితర సామగ్రిని వెలికితీసేందుకు

(మిగతా 6లో..)

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎక్కడ?

- కల్తీ ఆహార పదార్థాలకు అడ్డాగా జోగులాంబ గద్వాల జిల్లా
- హోటళ్లు, బేకరీలలో కాలం చెల్లిన తినుబండారాలు
- రోగాల బారిన ప్రజలు .. చోద్యం చూస్తున్న అధికారులు
- జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేనట్లేనా?

6

రేషన్ బియ్యం స్వాధీనం

- నారాయణపేట మండలం జలాల్‌పూర్ నుంచి కర్ణాటకకు వ్యాన్‌లో అక్రమంగా తరలింపు
- టాస్క్‌ఫోర్స్, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు
- 29 క్వింటాళ్లు పట్టివేత.. వ్యక్తిపై కేసు నమోదు

7

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు మహిళలు
- పురుగుల మందు తాగి అఘాయిత్యం
- వనపర్తి జిల్లాలో యువకుడు

6


గుడిసెకు నిప్పంటించి చోరీ

- మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వాడియాల గ్రామంలో ఘటన
- తులం బంగారం, రూ.30 వేల నగదు అపహరణ

7

గంజాయికి అడ్డాగా గుట్టలు

- అభయుడి ఆలయ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు
- పట్టించుకోని అధికారులు



ఆలయం వద్ద ఉన్న గుట్టలు

నాగర్‌కర్నూల్/ఊర్కొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అభయాంజనేయస్వామి ఆలయం పరిసర ప్రాంతంలో ఉన్న గుట్టలు గంజాయికి అడ్డగా మారాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట శివారులో గుట్టల మధ్య వెలసిన అభయాంజనేయ స్వామి వారి ఆలయానికి ప్రతీ శనివారం, మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తుల ముసుగులో గంజాయి సరఫరా చేస్తున్న బ్యాచులు సొమ్ము చేసుకుంటున్నాయి. దీంతో పాటు అక్కడ వ్యాపారం చేస్తున్న వారు మద్యం విక్రయిస్తున్నా పాలకమండలి, దేవదాయ శాఖ అధికారులు

(మిగతా 6లో..)

బెట్టింగ్‌లకు దూరంగా ఉండండి

- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యువత క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌లకు దూరంగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, నిషేధిత గేమింగ్ ప్లాట్‌ఫామ్స్, ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడొద్దన్నారు. తక్కువ సమయంలో అధికంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌కు యువత బానిసలు అవుతున్నారని చెప్పారు. అప్పులు చేసి, ఆర్థికంగా నష్టపోవడంతో మానసిక ఒత్తిడికి గురై తప్పుడు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ప్లేకార్డ్స్, ఇతర గేమింగ్ యాప్స్‌పై తెలంగాణ పోలీస్‌శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసిందని, ఆధునిక సాంకేతికత సాయంతో ఇలాంటి అక్రమ కార్యక్రమాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలు, ప్రవర్తనపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఆన్‌లైన్ కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని కోరారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండి, బెట్టింగ్‌లపై పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

హుండీ డబ్బులు స్వాహా

- జోగులాంబ గద్వాలలోని జములమ్మ ఆలయంలో ఘటన
- లెక్కింపు సమయంలో రూ.లక్ష నొక్కేసిన కాంట్రాక్ట్ ఉద్యోగి
- ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన
- మళ్లీ హుండీలో వేయించిన అధికారులు
- సీసీటీవీ ఫుటేజీ పరిశీలనతో బహిర్గతం

7

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

» న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రజిని



సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి రజిని

శ్రీరంగాపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి రజిని విద్యార్థులకు సూచించారు. వనపర్తి జిల్లా, శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు అంగీకారంతో పెళ్లి చేసుకున్నా చట్టం ప్రకారం చెల్లదని తెలిపారు. పెళ్లి చేసుకున్న వ్యక్తిపై పోక్సో యాక్టు ప్రకారం కేసు నమోదు అవుతుందన్నారు. అలాగే బాలిక అనుమతితో శారీ రకంగా కలిసినా అత్యాచారం కింద కేసు నమోదు అవుతుందని చెప్పారు. అలాగే బాల్య వివాహాల నిరోధక చట్టం, మోటార్ వెహిక ల్ యాక్టు, బాల కార్మికుల చట్టం, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సలహాల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సఖి లీగల్ కౌన్సెలర్ కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

» నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు మహిళలు

» వనపర్తి జిల్లాలో యువకుడు

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు మహిళలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన వస్పరి మల్లమ్మ (40) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో తన కుమార్తె గుంత శివమ్మను రమ్మని పిలిచింది. కానీ అల్లుడు మల్లేశ్ ఆమెను పంపించలేదు. దీంతో మనస్తాపానికి గురైన మల్లమ్మ గత నెల 26న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. చుట్టుపక్కల వారు చూసి ఆమెను జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. కుమార్తె శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరో మహిళ చిక్కంద్ర బాలమ్మ(60)గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గత నెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన భర్త చంద్రయ్య జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. భర్త చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..



మిద్దె ఆంజనేయులు (ఫైల్)

రేవల్లి (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలి పిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన మిద్దె ఆంజనే యులు (35) గతనెల 25న నాగర్‌క ర్నూల్ మండలంలోని దేశిటిక్యాల గ్రామంలో తన బంధువుల అంత్యక్రియలకు వెళ్లాడు. అదే రోజు సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చుట్టు పక్కల వారు నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆంజనేయులుకు భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి వివిధ పార్టీల నాయకులు ఆర్థిక సాయం అందించారు. ఆంజనేయులు మృతదేహం వద్ద సింగిల్‌విండో చైర్మన్ రఘుయాదవ్, ప్రతాప్‌రెడ్డి నివాళులర్పిం చి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాలానగర్, ఏప్రిల్ 1 : మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలం లోని పెద్దాయపల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. బిహార్ రాష్ట్రం, భగల్పూర్ జిల్లాకు చెందిన బినోద్‌ముర్ము (37) అనే వ్యక్తి స్థానిక సర్ఫ్ కంపెనీలో పని చేస్తున్నాడు. సమీపంలోని రూప్‌సింగ్ తండాలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో పరిశ్రమలో విధులకు వెళ్తూ, జాతీయ రహదారిని దాటుతుండగా, జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దీంతె అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బాలానగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కుటుంబసభ్యులు మంద లించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ లెని న్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, బాలా నగర్ మండలంలోని చింతగూడతండాకు చెందిన రఘువర్ధన్ (19) కొంత కాలంగా ఓ మహిళతో తిరుగుతున్నాడు. విషయం తెలిసిన కుటుంసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన అతడు సోమవారం మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వెనుక చెట్ల కిందకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అదే సమయంలో కుటుంబ సభ్యులు ఫోన్ చేయడంతో తాను రైల్వే స్టేషన్ వెనుక ఉన్నట్లు అతడు చెప్పాడు. దీంతో వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అతడి పరిస్థితిని గమనించి చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు చేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

» వారిలో ఒకరి పరిస్థితి విషమం

శ్రీరంగాపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వస్తున్న కుక్క పరుగెత్తుతూ వచ్చి తగలడంతో బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలంలోని గోవర్ధనగిరికి చెందిన దుబ్బ చింతలయ్య, చిన్న చింతలయ్య మంగళవారం ద్విచక్ర వాహనంపై శ్రీరంగాపూర్ నుంచి పెబ్బేరుకు వెళ్తున్నారు. శ్రీరంగాపూర్ మండలంలోని కంబాలాపురం రైస్ మిల్లు సమీపంలో ఓ కుక్క పరుగెత్తుతూ వచ్చి వారి బైక్‌కు తగలడంతో అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుబ్బ చింతలయ్యను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్న చింతలయ్య స్వల్పంగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గంజాయికి అడ్డాగా గుట్టలు

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా అక్కడే కొందరు దేవాలయ గదులలో తిష్టవేసి ఉండటంతో వారి వద్దకు వస్తూ అక్కడ జరిగే అన్ని కార్యకలపాలకు సూత్రధారులుగా ఉంటున్నారు.

వీడియోలు తీసి..

భక్తుల రాకను గమనిస్తూ వారు స్వామివారిని దర్శించుకునేవారు కొందరు అయితే... మరి కొందరు స్వామివారి దర్శనం పేరు చెప్పుకొని ప్రియులతో కలిసి వచ్చే వారు ఉన్నారు. వీరు ఆలయ సమీప గుట్టల్లోకి వెళ్లి ఏకాంతంగా గడుపుతుంటారు. ఇలాంటి వారి వీడియోలు తీసి భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి డబ్బులు గుంజడం పోకిరీలకు అలవాటయింది. ఈ పోకిరీలకు కొందరు పోలీసులు సహకరించడంతో గంజాయి బ్యాచ్‌లు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన సామూహిక హత్యాచారానికి కారణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గంజాయి సరఫరా చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఆలయ ప్రాంగణంలో నిలిపిన వాహనాలు

అత్యాచార సంఘటన కలిచివేసింది

జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

అత్యాచార ఘటన కలచివేసిందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సామూహిక అత్యాచార ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్ర దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగజేస్తున్న ఎంతటి వారినైనా వదిలిపెట్టొద్దని హెచ్చరించారు. శనివారం రాత్రి జరిగిన అత్యాచారానికి ఒడిగట్టిన నిందితులు ఏడు మందిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళపై ఇలాంటివి చోటుచేసుకోవడం చూస్తుంటే మనము ఇలాంటి సమాజంలో ఉన్నమా అని భావోద్వేగానికి గురయ్యారు. ప్రజా ప్రభుత్వం బాధితురాలికి అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనకు 40 రోజులు

(5వ పేజీ తరువాయి..)

యంత్రాలతో పాటు వాటిని కత్తిరించేందుకు థర్మల్, ప్లాస్మా, గ్యాస్ కటర్లను వియోగించి పనులు చేపడుతున్నట్లు రెస్క్యూ పనుల్లో పాల్గొనే అధికారులు చెబుతున్నారు.

పది రోజుల్లో శిథిలాల తొలగింపు పూర్తయ్యేనా..?

సొరంగంలో కూరుకుపోయినా శిథిలాల తొలగింపు ప్రభుత్వం ఈనెల పది వరకు పూర్తి చేయాలని గడువును నిర్దేశించింది. నిత్యం 11 ఏజెన్సీలకు సంబంధించిన 600 మంది రెస్క్యూ సిబ్బంది మూడు షిఫ్టుల్లో పాల్గొంటున్నారు. పనుల్లో వేగం పెంచేందుకు ప్రస్తుతం 13.630 మీటర్ల దగ్గర నుంచి 13.730 వరకు పొడిగించనున్నారు. కన్వేయర్ బెల్ట్‌ను పునరుద్ధరించేం మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువగా 20 నుంచి 30 అడుగుల వరకు పేరుకు పోయిన శిథిలాలు ఉన్న 253 మీటర్లల్లో గడిచిన పది రోజుల్లో 100 మీటర్ల వరకు శిథిలాలను తొలగించారు. ఇంకా 153 మీటర్లను తొలగించేందుకు మరో రెండు వారాలకుపైగా పట్టే అవకాశం ఉందని రెస్క్యూ సిబ్బంది తెలిపారు. అత్యంత క్లిష్ట పరిస్థితులలో డీ1, డీ2 ప్రాంతంలో ఉన్న 20 మీటర్ల దూరం పూర్తిగా శిథిలాలను తొలగించారు. ప్రభుత్వం విధించిన ఏప్రిల్ 10 గడువులోగా పనులు పూర్తి కావడం కష్టమే..



శిథిలాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

సహాయక చర్యల్లో..

ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటన పనులను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సొరంగంలో జరుగుతున్న పనుల పురోగతిపై రెస్క్యూ బృందాల అధికారులతో వివరాలు అడగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహాయక పనులకు ఆటంకంగా ఉన్న ఇనుము పదార్థాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలించడంతో పాటు, మట్టి తవ్వకాలు జరుపడం ఊట నీటిని బయటకు పంపింగ్ చేయడంతో పాటు కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు మన్మోహన్ యాదవ్, సత్యనారాయణ, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి, గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, సుదర్శన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారులు నేతి చంద్ర, రవీంద్రనాథ్, సింగరేణి రెస్క్యూ మైన్స్ మేనేజర్లు మాధవరావు, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎల్‌బీసీని పరిశీలించనున్న మంత్రి పొంగులేటి

» సహాయక చర్యలపై అధికారులతో మంత్రి సమీక్ష

ఎస్ఎల్‌బీసీ వద్ద జరుగుతున్న సహాయక చర్యలను పరిశీలించేందుకు నేడు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించనున్నట్లు ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి నేటి వరకు కొనసాగుతున్న సహాయక చర్యలపై మంత్రి సమీక్ష నిర్వహించనున్నారని ఆయన తెలిపారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎక్కడ..?

» కల్తీ ఆహార పదార్థాలకు అడ్డాగా

జోగులాంబ గద్వాల జిల్లా

గద్వాల క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లాలోని కొన్ని హోటళ్ల యజమానులు నాణ్యత లేని ఆహారాన్ని ప్రజలకు అంటగడుతూ వారి ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. జిల్లాలో ఎటు చూసినా కల్తీ ఆహార పదార్థాల తయారీ... హోటళ్లు, బేకరీలు, కిరాణదుకాణాల యజమానులు నాణ్యత పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆటా.. పాడిందే పాట అన్నట్లు ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

తినుబండారాలలో బల్లులు, బొద్దింకలు..

జిల్లా కేంద్రంలోని అహ్మద్ టిఫిన్ సెంటర్‌లో ఇటీవల బల్లి పడిన చట్నీని తిని నలుగురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో పోలీసులు హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. గతంలో పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో తీసుకున్న దోశలో బొద్దింక వచ్చింది. దీంతో పాటు పలు బేకరీలలో, హోటళ్లలో దుర్వాసన వస్తున్న ఆహారపదార్థాలు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గద్వాల పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తా సమీపంలో ఓ బేకరీలో తీసుకున్న తినుబండారాలు దుర్వాసన రావడంతో బేకరీ యజమానికి, కొనుగోలు దారుడికి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. అదేవిధంగా వేణుకాలనీకి చెందిన దిలీప్‌కుమార్ అనే యువకుడు జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో ఇటీవలే కుష్క పార్సిల్ తీసుకొని ఇంట్లో తినేందుకు ప్రయత్నించగా దుర్వాసన రావడంతో ఆ యువకుడు హోటల్ యజమానికి ఫిర్యాదు చేయబోతే ఆ యువకుడిపై దాడికి యత్నించినట్లు తెలిసింది. ఆ దుర్వాసన వస్తున్న కుష్కను తీసుకొని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేద్దామనుకున్నా.. జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అచూకి దొరకలేదు. ఇలా ఆహార పదార్థాల కల్తీపై ఎవరికి చెప్పాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి జిల్లాలో కల్తీ ఆహార పదార్థాలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హోటళ్లను తనిఖీ చేసిన పట్టణ పోలీసులు...

కొంత కాలంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో లేకపోవడంతో పట్టణంలోని హోటళ్లను ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో కుళ్లిన ఆహార పదార్థాలు, శుభ్రత లేని వంట గదులు, మద్యం మత్తులో వంట చేయడం వంటివి బయటపడ్డాయి. నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని హోటళ్ల యజమానులను హెచ్చరించారు. పట్టణంలోని గంజిపేటలో ఇటీవలే అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు చేసి యజమానులపై కేసు నమోదు చేశారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆచూకీ కరువు

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎవరో కలెక్టరేట్ అధికారులకు కూడా తెలియదనే చెబుతున్నారు. చివరకు ఆమె ఫోన్ నంబరు కూడా ఎవరికీ తెలియదని చెబుతున్నారు. జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పరిస్థితి ఇలా ఉంటే ఆహార నాణ్యత విషయంలో ఎవరికి ఫిర్యాదు చేయలో తెలియక జిల్లా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ అధికారి గద్వాల జిల్లాతో పాటు మరో రెండు జిల్లాలలో కూడా అదనపు బాధ్యతుల నిర్వహిస్తున్నందున గద్వాలలో కనిపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అధికారి గద్వాలలో ఎప్పుడు పర్యటిస్తుందో.. జిల్లాలో జరుగుతున్న కల్తీ ఆహార పదార్థాల విక్రయాలకు చెక్ పెడుతుందోనని పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండలు తీవ్రం

» జోగులాంబ గద్వాల జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 39.9 డిగ్రీలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత పెరిగింది. జిల్లాలో మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 39.9 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27.2 డిగ్రీలు నమోదైంది.

వనపర్తి జిల్లా కొత్తకోట మండలంకానాయపల్లిలో 39.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పాన్‌గల్ మండల పరిధిలోని కేతేపల్లిలో 20.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 37.9, కనిష్ఠం 24.2 డిగ్రీలు నమోదైంది.

నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 37 డిగ్రీలు, కనిష్ఠం 21 డిగ్రీలు, నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 36 డిగ్రీలు, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఉత్సాహంగా బండ్ల గిరక పోటీలు



బండ్ల గిరక పోటీల్లో పాల్గొన్న ఎద్దులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న మాజీ ఉపసర్పంచు, వాల్మీకి సంఘం నాయకుడు

మల్దకల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రంలో కేజీబీవీ వద్ద మంగళవారం నిర్వహించిన బండ్ల గిరక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వాల్మీకి యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు తిమ్మప్ప, మాజీ ఉపసర్పంచ్ సీకిన మల్దకల్, నాయకుడు సిద్ధి నరసింహులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 14 ఎద్దుల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల్లో గంగన్నగారి పవన్(మల్దకల్)కు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 5,116 బహుమతి పొందాయి. ఎద్దులంబాయి గంగన్నకు చెందిన ఎద్దులు ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకొని రూ.4,116 గెలుచుకున్నాయి. బలిజ సిద్ధిరామప్పకు చెందిన ఎద్దులు తృతీయ స్థానం, నక్క రామన్నకు చెందిన ఎద్దులు నాలుగవ స్థానం, పెంచికలపాడు నరసింహులుకు చెందిన ఎద్దులు ఐదవ స్థానాన్ని దక్కించుకున్నాయి. వరుసగా రూ. 3,116, రూ. 2,116, రూ. 1,116 బహుమతులు పొందాయి. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యులు, వాల్మీకి యూత్ నాయకుడు పరశురాముడు, రామారావు, తిమ్మప్ప, చుక్క అంజి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

» సీఐ కనకయ్యకు భలాన్‌పల్లి గ్రామస్థుల వినతి



అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న యువకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ సీఐ కనకయ్యకు వినతి పత్రం అందజేస్తున్న భలాన్‌పల్లి గ్రామస్థులు

తాడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భలాన్‌పల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా గ్రామానికి చెందిన కొంతమంది యువకులకు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ గ్రామంలో ప్రజలకు ఇబ్బందికి గురి చేస్తున్నారంటూ గ్రామస్థులు మంగళవారం నాగర్‌కర్నూల్‌లోని సీఐ కనకయ్యకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని కొంత మంది యువకులు అసాంఘిక కార్యకలాపాలైన బీడీ, సిగరెటు, మద్యం, మత్తుపానియాలకు బానిసలుగా మారి గ్రామంలో అల్లర్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధానంగా మరికొంతమంది యువకులు గంజాయికి అలవాటు పడి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో మహిళలకు రక్షణ కరువైందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న యువకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గ్రామానికి గంజాయి సరఫరా అవుతుందన్న అనుమానం గ్రామస్థులు వ్యక్తం చేయడంతో సానుకూలంగా స్పందించిన సీఐ కనకయ్య అలాంటి వారిపట్ల శాఖపరమైన నిఘా ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్

» విన్నర్‌గా నాగర్‌కర్నూల్ కేలో ఇండియా జట్టు



వెన్నచెర్లలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన కందనూలు జట్టుకు నగదు, కప్‌ను అందజేస్తున్న మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్లలో నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ అట్టహాసంగా సోమవారం రాత్రి ముగిశాయి. ఈ కబడ్డీ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 22 జట్లు వచ్చాయి. ఫైనల్‌లో నాగర్‌కర్నూల్ కేలో ఇండియా వర్సెస్ వెన్నచెర్ల జట్లు తలపడ్డాయి. ఇందులో నాగర్‌కర్నూల్ కేలో ఇండియా జట్టు విన్నర్‌గా విజయం సాధించగా మొదటి బహుమతి 20వేలు, కప్‌ను పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన వెన్నచెర్ల జట్టుకు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండు నరసింహ రూ.15 వేలు, మెమొంటో అందజేశారు. మూడో బహుమతి గుడిపల్లి ఏ జట్టుకు రూ.10వేలు, మెమొంటోను, నాల్గవ బహుమతి నాగర్‌కర్నూల్ మిషన్ జట్టుకు రూ.5వేలు మెమొంటోను అందించారు. అయితే టోర్నమెంట్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా బాలికల రెండు కబడ్డీ జట్లు నిలిచాయి. అలాగే గ్రామంలోని జడ్పీ హై స్కూల్ నుంచి స్టేట్ లెవల్‌లో కబడ్డీ ఆడిన బాలికలు ఎండి.బాస్రిన్‌బేగం, ఆది శైలజ(ఆ ఇద్దరి క్రీడాకారులు)లను మాజీ ఎంపీపీ మెమొంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు. బెస్ట్ రైడర్‌గా నిలిచిన జాఫర్‌ను, బెస్ట్ డిఫెండర్ దామోదర్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండు నరసింహ అభినందించారు. నిర్వాహకులుగా జెట్టి దామోదర్, మద్దని కుర్మయ్య, మద్దని ప్రదీలు వ్యవహరించారు. గ్రామ మాజీ సర్పంచ్ రాధ బాలస్వామి, మాజీ ఎంపీటీసీ డి.రవికుమార్, దేవుని తిర్మలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బి.సత్యం, గంట్రావుపల్లి మాజీ సర్పంచ్ పగడాల చిన్నయ్య, నక్కలపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ మేకల మల్లేష్, ముష్టిపల్లి గ్రామ నాయకులు గాదరి చంద్రశేఖర్, శ్రీనివాస్‌యాదవ్, సుధాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు డి.లక్ష్మీకాంతం, కొత్త రవీందర్‌రెడ్డి, మొట్టే శేఖర్ పాల్గొన్నారు.

ఫౌంటైన్ కాదు



ఆకాశంలోకి ఎగిసి పడుతున్న నీటిని చూసి ఫౌంటైన్ అనుకున్న పొరపాటు పడొద్దు. అది 'మిషన్ భగీరథ' పైప్‌లైన్ లీక్ అవుతుండటంతో విరజిమ్ముతున్న నీరు. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి సమీపంలో, జాతీయ రహదారి పక్కన ఈ సంఘటన జరిగింది. ఈ విషయంపై మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించింది. రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా, పైపులైన్ పగిలిపోయిందని తెలిపారు. సమాచారం అందగానే నీటి సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. బుధవారం పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

- పెబ్బేరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో ఈ విషాద సంఘటన జరిగింది. సిద్ధాపూర్ ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా, దేవరకొండ మండలం, సాకేల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య (40) అచ్చంపేట మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన బుర్యానాయక్ పొలంలో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయిన విద్యుత్ లేక పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. లైన్ మార్చేందుకు యత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. యజమాని బుర్యానాయక్ మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా వెంకటయ్య మృతదేహం కనిపించింది. దీంతో ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా, ఇద్దరికి గాయాలు

» స్పందించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

» పోలీసు వాహనంలో ఆసుపత్రికి తరలింపు



గాయపడ్డవారిని వాహనంలో ఎక్కిస్తున్న పోలీసులు, చిత్రంలో ఎస్పీ

వెల్దండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరు గాయపడ్డారు. అదే దారిలో వస్తున్న నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ గమనించి బాధితులను పోలీసు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని కొట్ర సమీపంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపునకు వెళ్తున్న ఆటో కొట్ర సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న గోరేమియా, హమాంబీలు గాయపడ్డారు. అదే సమయంలో కల్వకుర్తి నుంచి వెల్దండ వైపునకు వెళ్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ గమనించి తన వాహనాన్ని ఆపారు. అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో క్షతగాత్రులను పోలీసు వాహనంలో కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

అమరచింత, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఓ వ్యవసాయ కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూరుకు చెందిన నాగరాజు (25) వ్యవసాయ కూలీగా పని చేస్తు జీవనం గడుపుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో విసిగిపోయిన ఆయన సోమ వారం రాత్రి ఏడు గంటల తర్వాత సమీపంలోని పొలానికి వెళ్లి గడ్డి మందు తాగి వస్తూ దారిలో అపస్మారక స్థితిలో పడిపోయాడు. అర్ధరాత్రి దాటినా ఆయన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకగా ఆయన కనిపించాడు. వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుడిసెకు నిప్పంటించి చోరీ



వాడియాల గ్రామంలో కాలిపోయిన గుడిసెను పరిశీలిస్తున్న స్థానికులు

మిడ్జిల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని వాడియాల గ్రామానికి చెందిన బొర్ర చంద్రయ్య గుడిసెకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి, నగదు, బంగారం చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొర్ర చంద్రయ్య కుమారుడు ఇటీవల మృతి చెందాడు. దీంతో ఇంట్లో పండుగ చేసుకునేందుకు వీలు లేకపోయింది. దీంతో ఉగాది పండుగ కోసం జడ్చర్లలోని తన కుమార్తె శ్యామల ఇంటికి భార్య అమ్మన్నమ్మతో కలిసి వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత ఒంటి గంట సమయంలో గుడిసెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. పక్క ఇంటి వ్యక్తి మాదారం నర్సింహ మిడ్జిల్ వీధి నాటకం నేర్పించేందుకు వెళ్లి తిరిగి వస్తూ మంటలను గమనించాడు. వెంటనే చంద్రయ్యతో పాటు గ్రామస్థులకు సమాచారం అందించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే గుడిసె ఓ పక్క కాలిపోయింది. సమాచారం అందుకున్న చంద్రయ్య గ్రామానికి చేరుకొని గుడిసెలోకి వెళ్లి పరిశీలించారు. తులం బంగారం, రూ. 30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. సంఘటనపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



మద్దూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్

మద్దూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లాలోని, భూనీడు వాగు నుంచి మంగళవారం సాయంత్రం ట్రాక్టర్లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకునేందుకు యత్నించారు. దీంతో డ్రైవర్ పరారవగా, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరించారు. ట్రాక్టర్ యజమాని మొగులప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన తెలుగు హన్మంతు మంగళవారం వ్యాన్‌లో 29 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నాడు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్, పేట పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో జలాల్‌పూర్ బస్టాండ్ వద్ద దాడులు నిర్వహించి పట్టుకున్నారు. హన్మంతు చుట్టుపక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి, కర్ణాటకలో విక్రయిస్తుండగా పట్టుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ కాళప్ప పంచనామా అనంతరం హన్మంతుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

బంతి బంతికీ ఓ లెక్క!

» ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న యువత

» సొంతంగా యాప్‌లను క్రియేట్ చేసుకున్న నిర్వాహకులు

» టీకొట్లు, హోటళ్లు, లాడ్జింగులే అడ్డాలు



జడ్చర్ల, ఏప్రిల్ 1 : (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్ మ్యాచ్‌లు జోరుగా కొనసాగుతున్నాయి. కోట్లాది మంది క్రికెట్ అభిమానులు టీవీలకు అతుక్కుపోతున్నారు. మరి కొందరు స్టేడియంలకు వెళ్లి మ్యాచ్‌లను తిలకిస్తున్నారు. ప్రతీ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. అదే తీరుగా బెట్టింగుల జోరూ కొనసాగుతోంది. బెట్టింగ్‌లు నిర్వహించేందుకు బుకీలు, పంటర్‌లు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారితో పాటు, బాగా తెలిసిన వారిని ఆకర్షిస్తున్నారు. బంతి బంతికీ బెట్టింగ్ చేస్తున్నారు. మ్యాచ్ చూస్తూనే ఓవర్‌లో ఇన్ని పరుగులు వస్తాయని, ఇన్ని సిక్స్‌లు, ఫోర్‌లు కొడ్తారని, ఓ బ్యాట్స్‌మెన్ అత్యధిక స్కోర్ చేస్తాడని, బౌలర్ ఇన్ని వికెట్లు తీస్తాడని, మొదటి బ్యాటింగ్ చేసిన జట్టు ఇంత స్కోర్ చేస్తుందని, ఏ బంతికి ఔట్ అవుతాడని.. ఇలా మ్యాచ్‌లో ప్రతి అంశంపైన బెట్టింగులు నిర్వహిస్తూ యువకులను ఆకర్షిస్తున్నారు. ఇలా రహస్యంగా బెట్టింగులు కొనసాగిస్తూ నిర్వాహకులు కోట్ల రూపాయలు దండుకుంటుండగా, పందేలు కాస్తున్న వారు మాత్రం సర్వం కోల్పోతున్నారు.

మ్యాచ్ ప్రారంభానికి ముందే..

మ్యాచ్ ప్రారంభం కంటే ముందే ఏ జట్టు గెలుస్తుందనే అంశంపై బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. మరి కొందరు మ్యాచ్ కొనసాగుతుండగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. అందుకు పట్టణాల శివారుల్లో ఉన్న కొన్ని ఛాయ్ హోటళ్లు బెట్టింగులకు అడ్డాగా మారినట్లు తెలుస్తోంది. అక్కడ ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్లలో మ్యాచ్‌లు చూస్తూ బెట్లు కడుతున్నారు. మరికొందరు హోటళ్లు, లాడ్జింగ్‌లలో గదులను అద్దెకు తీసుకుని, టీవీల్లో మ్యాచ్‌లను చూస్తూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు బెట్టింగ్ నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడిన జడ్చర్లకు చెందిన ఓ యువకుడు సొంతంగా యాప్‌లను క్రియేట్ చేసి, ప్రస్తుతం ఆన్‌లైన్లో బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అలాగే ఉమ్మడి జిల్లాలో కొందరు బ్రోకర్‌ల అవతారం ఎత్తారు. ప్రధాన పట్టణాలలోని బుకీలు, పంటర్‌లకు సంబంధించిన ఫోన్ నెంబర్లను బెట్టింగులకు పాల్పడే వారికి ఇచ్చి, వారి నుంచి కమీషన్లు తీసుకుంటున్నట్లు తెలిసింది.

కేసులు నమోదవుతున్నా...

బెట్టింగ్‌రాయళ్లపై కేసులు నమోదవుతున్నా దందా మాత్రం ఆగడం లేదు. రెండు సంవత్సరాల క్రితం మ హబూబ్‌నగర్ పట్టణంలోని ఓ వైన్స్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఏడుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. గద్వాల జిల్లాలో గత సంవత్సరం వేర్వేరుగా నమోదయిన రెండు బెట్టింగ్ సంఘటనల్లో 16 మందిపై కేసులు నమోదయ్యాయి. అలాగే ఆన్‌లైన్లో బెట్టింగ్‌కు పాల్పడుతూ జడ్చర్లకు చెందిన ఓ యువకుడు కర్నూలులో పట్టుబడ్డాడు. అతడిపై హైదరాబాద్‌లోనూ కేసులు నమోద య్యాయి. కాగా ఆ వ్యక్తే ప్రస్తుత సీజన్‌లో ప్రత్యేక యాప్‌లను తయారు చేసి ఆన్‌లైన బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అప్పుల ఊబిలో యువత

బెట్టింగ్‌లతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చన్న దురాశతో కొందరు యువకులు వేలాది రూపాయలు నష్టపోతున్నారు. ఒక వేళ బెట్టింగ్‌లో గెలిచినా, సదరు బుకీ, పంటర్, బ్రోకర్లు డబ్బులు ఇవ్వకపోవడంతో ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితిలో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. నష్టపోయిన యువకులు పోగొట్టుకున్న డబ్బును ఎలాగైనా సంపాదించుకోవాలన్న ఆశతో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, బంగారు వస్తువులు, బైకులు, కార్లు, విలువైన వస్తువలను కుదువ పెట్టి అప్పులు తీసుకుని మరీ బెట్టింగ్ చేస్తున్నారు. మళ్లీ మళ్లీ నష్టపోతున్నారు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, తల్లిదండ్రులకు చెప్పుకోలేక కొందరు యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించినా, పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్ నిర్వాహకులు, పాల్గొనే వారిపై ఇప్పటికే నిఘా పెట్టాం. ఇప్పటికే కొందరిని బైండోవర్ కూడా చేశాం. కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటాం. తమ పిల్లలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నా, ఇంట్లో విలువైన వస్తువులు మాయం అవుతున్నా, ఆందోళనకు గురవుతున్నట్లు గుర్తించినా తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు అప్రమత్తం కావాలి. బెట్టింగ్‌లతో యువకులు జీవితాలను నాశనం చేసుకోవద్దు.

వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

లక్షల రూపాయలు నష్టపోయి..

ఉమ్మడి జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లతో లక్షల రూపాయలు నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటన లున్నాయి. రెండు రోజుల క్రితం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు బెట్టింగులతో రూ. 5 లక్షలు నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. గత సంవత్సరం ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దాదాపు రూ. 80 లక్షలు బెట్టింగులో పెట్టి పోగొట్టుకోవడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు.

జాతీయ స్థాయి పోటీలకు

టెక్నికల్ అఫీషియల్‌గా రూప



రూప

మక్తల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం, కర్ని ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న రూప ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికయ్యారు. ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు ఒడిషా రాష్ట్రం, పూరీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళలు, పురుషుల చాంపియన్‌షిప్ పోటీలకు ఆమె టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఒబేదుల్ల కొత్వాల్, కార్యదర్శులు విలియమ్స్, ఉపాధ్యక్షుడు గోపాలం, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

రాష్ట్ర జట్టుకు మక్తల్ విద్యార్థిని శశికళ



శశిరేఖ

కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శశిరేఖ ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. వరంగల్ జిల్లా గీసుకొండలో జనవరి 9 నుంచి 11 వరకు నిర్వహించిన ఖోఖో రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల పోటీల్లో పాల్గొని ఆమె ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, పీడీ రూప తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు ఒడిషా రాష్ట్రం పూరీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి మహిళల ఖోఖో పోటీల్లో రాష్ట్రం తరఫున ఆమె పాల్గొననున్నట్లు తెలిపారు. శశిరేఖ గతంలో మూడు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

హుండీ డబ్బు స్వాహా

» లెక్కింపు సమయంలో రూ.లక్షకు పైగా కొట్టేసిన కాంట్రాక్ట్ ఉద్యోగి

» మళ్లీ హుండీలో వేయించిన అధికారులు » జములమ్మ ఆలయంలో వెలుగు చూసిన సంఘటన

గద్వాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, నడిగడ్డలో భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న జములమ్మ దేవత హుండీ డబ్బునే స్వాహా చేశాడో ప్రబుద్ధుడు. లెక్కింపు సమయంలో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి రూ. లక్షకు పైగా కొట్టేశాడు. ఈ విషయం నాలుగు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత శుక్రవారం ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో పురేందర్ కుమార్, ఆలయ చైర్మన్ వెంకట్రాములు ఆధ్వర్యంలో జములమ్మ హుండీని లెక్కించారు. శ్రీ వేంకటేశ్వర సేవా సమితి అధ్యక్షుడు అభిలాష్ ఆధ్వర్యంలో సేవా సమితి సభ్యులు దాదాపు వంద మందికి పైగా పాల్గొని హుండీ డబ్బులను వేరు చేశారు. రూ. 500, రూ. 200, రూ. 100, రూ. 50 ఇలా వేరు చేసిన కట్టలను ఆలయ సిబ్బంది బ్యాంకు అధికారుల వద్దకు తీసుకొచ్చి ఇచ్చేవారు. ఆ సమయంలో ఆలయంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి రూ.500 నోట్ల కట్టలు రెండుకు పైగా ఎత్తేశాడు. ఆ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హుండీ లెక్కింపు సమయంలో దాదాపు గంటసేపు ఆ ఉద్యోగి అక్కడ కనిపించకుండా పోయినట్లు గుర్తించారు.

బయటపడింది ఇలా...

గత ఏడాది జాతర ప్రారంభం అయిన 45 రోజుల తర్వాత హుండీని లెక్కించారు. అప్పట్లో రూ.27.28 లక్షలు ఆదాయం వచ్చిం ది. ఈ ఏడాది జాతర ప్రారంభమైన 65 రోజుల తర్వాత హుండీని లెక్కించారు. రూ.27.78 లక్షలు వచ్చింది. గత ఏడాది కంటే రూ.50వేలు మాత్రమే ఎక్కువ వచ్చింది. దాదాపు 20 రోజులు అంటే, మూడు మంగళ, శుక్రవారాలు అధికంగా రూ.50 వేలు మాత్రమే వచ్చింది. దీనిపై అధికారులకు కూడా అనుమానం వచ్చింది. ఇదే క్రమంలో కాంట్రాక్టు ఉద్యోగి ఒకరు రూ.లక్షకు పైగా హుండీ డబ్బులను ఎత్తేశాడనే విషయం బహిర్గతం కావడంతో అధికారులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అయితే ఈ సంఘటనను బహిర్గతం చేయడానికి అధికారులు ఇష్టపడటం లేదు. వారిపై తీవ్రమైన రాజకీయ ఒత్తిడులు ఉండటమే అందుకు కారణమని తెలుస్తోంది. అయితే ఆ ఉద్యోగి స్వాహా చేసిన డబ్బును మంగళవారం తిరిగి హుండీలో వేయించినట్లు సమాచారం. ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ విషయంపై ఈవో పురేందర్ మాట్లాడటానికి నిరాకరించారు. ఆలాగని పూర్తిగా కొట్టివేయలేదు.



ఆలయంలో కొలువుదీరిన జములమ్మ దేవత మూలవిరాట్

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి తృతీయ వార్షికోత్సవాలు



వేంకటేశ్వరస్వామి మూల విరాట్

తిమ్మాజిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో కొలువుదీరిన మహాలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి తృతీయ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ మంత్రి చర్లకోలా లక్ష్మారెడ్డి తన సొంత నిధులతో దేవాలయాన్ని నిర్మింపజేశారు. వేంకటేశ్వరస్వామి కరుణ కటాక్షాలతో ఆలయం దినదినాభివృద్ధి జరుగుతున్నది. ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని మొదటి రోజు విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవచనం, మృత్‌సంగ్రహనం, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ మూలమంత్ర హోమం, ఎదుర్కోళ్ల ఉత్సవం, పల్లకి సేవ వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. భజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ప్రతి రోజు పూజా కార్యక్రమాలతో పాటుగా అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో వీరభద్రేశ్వరస్వామి

దామరగిద్ద, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల పరిధిలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షుడు బసంత్‌రాజ్, ప్రధాన అర్చకుడు శివకుమార్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, అంకురార్పణ, ధ్వజారోహణ, రుద్రాభిషేకం నిర్వహించారు. భద్రకాళి అమ్మవారికి విశేష అలంకరణ, కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గణేష్‌స్వామి, శరణయ్యస్వామి, చెన్నస్వామి, మోనేశ్, బసప్ప, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

» సుఖశాంతులు కోరుతూ భక్తుల పూజలు

వంగూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్‌జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి దిద్దబండ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవంలో భాగంగా మొదటి రోజు ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య హోమ పూజలు వైభవంగా నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హోమపూజ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ నూతనంగా రూ.30 లక్షలతో ఆలయ నిర్మాణం, కల్యాణ మండపం నిర్మించడం అభినందనీయమన్నారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గున్న శ్రీనివాస్ రెడ్డి, ఈవో హిందుకుమార్, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న లక్ష్మారెడ్డి దంపతులు

అదుపు తప్పి ముక్కలైన లారీ

» డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలు

చారకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : లారీ అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లి రెండు ముక్కలయ్యింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని జూపల్లి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపునకు చక్కెర లోడుతో వేగంగా వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో లారీ ఇంజన్, బాడీ క్యాబిన్ విడిపోయాయి. డ్రైవర్ లక్ష్మీనారాయణ, క్లీనర్ ఏడుకొండలులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై తమకు ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు.



ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న లారీ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

దశల వారీగా గ్రామ సమస్యల పరిష్కారం

● పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి



మరికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మరికల్ అభివృద్ధి, గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కారం చేస్తున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

గ్రామంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఎన్ని ఉన్నాయి. ఎన్ని చెల్లించారు?

గ్రామంలో మొత్తం 2894 ఎల్‌ఆర్‌ఎస్‌లు ఉన్నాయి. 40 శాతం ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించారు.

పారిశుధ్య కార్మికులకు ఉగాది వేతనాలు చెల్లించారా?

మూడు నెలల వేతనాలకు గాను ఉగాది పండగకు రెండు నెలల వేతనాలు చెల్లించాం.

ట్రాక్టర్, ఆటోకు నెల ఖర్చు ఎంత?

ప్రతీ రోజు డీజిల్‌కు, మరమ్మతులకు నెలకు రూ.60 వేలు ఖర్చు అవుతున్నాయి.

గ్రామ పంచాయతీ నెల ఆదాయం ఎంత?

పంచాయతీకి నెలకు ట్యాక్స్ రూపంలో వచ్చే ఆదాయం కార్మికుల వేతనాలు, ట్రాక్టర్, ఆటో ఖర్చులకు సరిపోతుంది.

న్యూస్ బాక్స్

నేటి నుంచి సన్నబియ్యం పంపిణీ

కోస్గి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోస్గి మండలంలోని రేషన్ దుకాణాల్లో బుధవారం నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. కోస్గి పట్టణంలోని దుకాణం నెంబర్ 7లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తామని అన్నారు. గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో కూడా సన్నబియ్యం పంపిణీ ప్రారంభమవుతుందన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభం

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం చిట్యాల గ్రామంలో మంగళవారం ఎస్సీ సబ్‌ప్లాన్ రూ.10 లక్షల నిధులతో 115 మీటర్ల సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో చిట్యాల ఎంపీటీసీ మాజీ సభ్యులు రామలింగప్ప, మారుతీ గౌడ్, బీజేపీ నాయకుడు లక్ష్మయ్య, ఎం.అశోక్, పుల్లరి నాగేష్, చిన్న నింగప్ప, నర్సప్ప, రాము, అంజి, వెంకటేష్ పాల్గొన్నారు.

జాతర కరపత్రాలు విడుదల

ధన్వాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ, భజన కమిటీల ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 5 నుంచి 8 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జాజిమి వీరభద్రప్ప, భజన కమిటీ సభ్యులు ఉన్నారు.

రెనివట్లలో ఘనంగా పకీర్‌షా గంధోత్సవం

మద్దూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ మునిసిపాలిటీ పరిధిలోని రెనివట్ల గ్రామ శివారులో వెలసిన హజ్రత్ సయ్యద్‌షా పకీర్‌పాష వలీ రహెమతుల్లాలై గంధోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శంశొద్దీన్ ఆధ్వర్యంలో గ్రామం నుంచి గంధాన్ని ఊరేగించారు. అనంతరం గంధాన్ని సమర్పించారు. రంజాన్ పండగ మరుసటి రోజు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామ వాసులు పండగకు వచ్చి గంధోత్సవంలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. ఫాతెహ అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలి

ధన్వాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలని బాధితుడు అంజయ్య మంగళవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి వినతిపత్రం అందించారు. గత బీఆర్‌ఎస్ హయాంలో సిమెంట్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వివరాలు పరిశీలించి బిల్లుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వ వైఖరి మారాలి

● బీజేపీ పట్టణ అధ్యక్షుడు మణిశంకర్

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరానికి తలమానికమైన హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు వైఖరి మారాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యూనివర్సిటీ విద్యార్థులపై ఏకపక్ష ధోరణితో పోలీసు జులుంను ఖండించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే వెనక్కి తీసుకోకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అలాగే పోలీసులు అరెస్టు చేసిన యూనివర్సిటీ విద్యార్థులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సన్నబియ్యంతో వండిన

అన్నం తినేందుకు వస్తాం

» ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి
» నిరుపేదలు కడుపు నిండా తినాలనే సన్న బియ్యం పంపిణీ
» సన్నరకం వరికి రూ.500 బోనస్ ఇచ్చి రైతాంగానికి చేయూత
» జిల్లాలోని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ



పేట అశోక్‌నగర్‌లో రేషన్ సన్నబియ్యాన్ని వృద్ధురాలికి చూపిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట/ధన్వాడ/దామరగిద్ద/మరికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు కడుపు నిండా తినాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించేందుకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. సోనా బియ్యంతో వండిన అన్నం భుజించేందుకు మహిళల ఇళ్లకు త్వరలో కలెక్టర్‌తో కలిసి వస్తామని పేర్కొన్నారు. మంగళవారం నారాయణపేటలోని అశోక్‌నగర్‌తో పాటు మండలంలోని పేరపళ్ల గ్రామంలోని రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. అశోక్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇదివరకు రేషన్ దుకాణాల్లో ఇస్తున్న దొడ్డు బియ్యం తినకపోగా వాటిని పక్కదారి పట్టించారని అన్నారు. రైతాంగం పండించిన సన్నరకం ధాన్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాల్ వెంట రూ.500 బోనస్ ఇచ్చి అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సైదులు, అధికారి బాల్‌రాజ్, కాంగ్రెస్ నాయకులు హరినాయణబట్టడ్, గందె చంద్రకాంత్, బండి వేణుగోపాల్, ఎండీ.సలీం, సాయిబాబ, సుధాకర్, మహేష్, కోట్ల రవి, అఖిల్‌రెడ్డి, వెంకుగౌడ్, సంతోష్, మల్లేష్, మారుతి, బండి రాజేశ్వరి, శరణప్ప, రమేష్, మనోజ్, వినోద్, కార్తీక్, హర్షవర్ధన్ తదితరులున్నారు.

అదేవిధంగా, ధన్వాడలోని కోటపక్కాలో బాబా డీలర్ షాపు వద్ద ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి రేషన్ కార్డుదారులకు మంగళవారం సన్న బియ్యాన్ని అందించారు. తన పదవీ కాలంలో మండలంలో అన్ని అభివృద్ధి పనులు చేసి ముందుకు తీసుకెళ్తానన్నారు. తహసీల్దార్ సింధూజ, మార్కెట్ యార్డు డైరెక్టర్లు జట్రం లక్ష్మయ్యగౌడ్, నీరటి రాంచంద్రయ్య ముదిరాజ్, ఊసు బాలకృష్ణ, చీరాల సుధాకర్‌రెడ్డి, రహిమన్‌ఖాన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జేసీబీ రాజు, జుట్ల ఆనంద్‌గౌడ్, షాకీర్‌హుస్సేన్ తదితరులున్నారు.

దామరగిద్ద మండల కేంద్రంలోని కుపేందర్ రేషన్ దుకాణంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి స్థానిక నాయకులతో కలిసి సన్న బియ్యం పంపిణీ చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ పుట్టి ఈదప్ప, సివిల్ సప్లై అధికారులు, డీఎస్‌వో బాల్‌రాజ్, డీఎం సీఎస్ సైదులు, డీటీలు ఆనంద్, కాశప్ప, నాగరాజ్, ఉప తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్, ఆంజనేయులు, రేషన్ డీలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మరికల్ మండల కేంద్రంలోని హరిజనవాడ రేషన్ దుకాణంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మంగళవారం సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సన్నరకం వరికి రూ.500ల బోనస్‌తో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో పేట మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి, జిల్లా నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి, రాజమణమ్మ, వీరన్న, హరీశ్, ఎల్.రాములు, రామకృష్ణ, మల్లారెడ్డి, బసిరెడ్డి, సంజీవరెడ్డి, డాక్టర్ ఇస్మాయిల్, ఖాజా, చందా హుసేన్ తదితరులున్నారు.



మక్తల్ పట్టణంలోని నెహ్రూగంజ్‌లో రేషన్ దుకాణం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

పేదల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

మక్తల్ : పేదల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని నెహ్రూగంజ్‌లో రేషన్ దుకాణం వద్ద ఆయన కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా పేద ప్రజలకు సన్నం బియ్యం అందించలేదన్నారు. తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తూ సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు గవినోళ్ల బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, గణేష్‌కుమార్, కట్ట సురేష్‌కుమార్‌గుప్తా, కావలి ఆంజనేయులు, కావలి తాయప్ప, కల్లూరి గోవర్ధన్, రవికుమార్, పుర కమిషనర్ శంకర్ నాయక్, చంద్రశేఖర్, అమర్, అమరేందర్, సీఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి ఉన్నారు.

శ్రీశైలం హుండీ లెక్కింపులో గుండుమాల్ వాసులు

కోస్గి రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో గుండుమాల్ మండల వాసులు పాల్గొన్నారు. శ్రీకృష్ణ దత్తసాయి సేవా సమితి కోఆర్డినేటర్ ఆనంద్‌గౌడ్ నేతృత్వంలో గుండుమాల్ మండలం నుంచి జె.శివకుమార్, ఎస్.భీమప్ప, వి.రఘు, జంగప్ప, జె.భరత్, ఎం.రంగప్ప, దస్తగిరి, వాసు, ఎస్.కనకమ్మ, వి.శశిరేఖ, మంజుల, హైమావతి, వరలక్ష్మి తదితరులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. వీరికి శ్రీశైలం దేవస్థానం సిబ్బంది ఉచిత సౌకర్యాలు కల్పించినట్లు కోఆర్డినేటర్ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ వెనక్కి తగ్గాలి

మక్తల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ వెనక్కి తగ్గి ఆ భూములను యూనివర్సిటీకి అప్పగించాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం కబ్జా చేయాలని చూస్తోందన్నారు. యూనివర్సిటీ భూములను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న ఏబీవీపీ నేతలను ప్రభుత్వం అణచివేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేవైఎం నాయకులు కుర్వలింగం, రాజగౌడ్, రాజు తదితరులున్నారు.

రెవెన్యూ గ్రామంగా మారేనా..?

» ఆరు గ్రామాల శివారులో రైతుల భూములు
» తప్పని ఇబ్బందులు, పట్టించుకోని అధికారులు




అప్పంపల్లి గ్రామ కమాన్

మరికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తరాలు మారినా అప్పంపల్లి గ్రామ తలరాత మాత్రం మారడం లేదు. ఎందరో సర్పంచ్‌లు, ఎందరో అధికారులు, ఎమ్మెల్యేలు మారుతున్నా అప్పంపల్లి గ్రామానికి రెవెన్యూ హోదా మాత్రం దక్కడం లేదు. రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని తహసీల్దార్ నుంచి ముఖ్యమంత్రి వరకు ఎన్నో వినతిపత్రాలను ఇచ్చినా గ్రామం తలరాత మాత్రం మారడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.


వివరాలు ఇలా..

1975లో అప్పంపల్లి గ్రామ పంచాయతీగా అవతరించింది. గ్రామంలో 450 కుటుంబాలు ఉండగా 22,500 మంది జనాభా ఉంది. ఇక్కడి ప్రతీ ఇంట్లో రైతులు ఉన్నారు. రైతుల పేరిట 2,511 ఎకరాల భూములు ఉన్నాయి. 150 ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉంది. మూడు చెరువులు, ఐదు కుంటలు, ఎనిమిది చెక్ డ్యామ్‌లు గ్రామం పరిధిలో ఉన్నాయి. ఇతర గ్రామాల రెవెన్యూ శివారులో భూములు మరికల్ శివారులో 1,020 ఎకరాలు, పసుపుల గ్రామ శివారులో 715 ఎకరాలు, మందిపల్లి శివారులో 413 ఎకరాలు, మాద్వార్ శివారులో 212 ఎకరాలు, ధన్వాడ శివారులో 101 ఎకరాలు, రాంకిష్టయ్యపల్లి శివారులో 50 ఎకరాలతో మొత్తం 2,511 ఎకరాలు, 95 శాతం అక్షరాస్యత సాధించిన గ్రామంగా రికార్డు ఉంది. భూములన్ని ఆరు రెవెన్యూ గ్రామాల శివారులో ఉండడంతో గ్రామానికి రెవెన్యూ పరంగా వచ్చే ఆదాయానికి గండి పడుతోంది. రెవెన్యూ సదస్సులు, బ్యాంకు రుణాలు, పంట నష్ట పరిహారం, ఏమైనా భూమి సమస్యలు వస్తే చివరకు భూములు కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా తదితర సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను సంప్రదించాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది. నేటివరకు ఏడు మంది సర్పంచ్‌లు, ఎంతోమంది అధికారులు మారినా రెవెన్యూ గ్రామంగా మార్చే నాథుడే కరవయ్యారు.

గ్రామ రెవెన్యూ ఆదాయం ఇతర గ్రామాలకు.. : కృష్ణారెడ్డి రైతు



అప్పంపల్లిని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించకపోవడం వల్ల రెవెన్యూ పరంగా గ్రామానికి వచ్చే ఆదాయం ఇతర గ్రామాలకు పోతోంది. ఆరు రెవెన్యూ గ్రామాల శివారులో తమ రైతుల భూములు ఉండటం వల్ల శిస్తులు, భూముల క్రయ విక్రయాలు జరిగినా రెవెన్యూ పరంగా వచ్చే ఆదాయానికి గండి పడుతోంది. తమకంటే చిన్న గ్రామాలు రెవెన్యూ గ్రామాలుగా అభివృద్ధి చెందుతున్నాయి..



అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి..

స్థానిక ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు పలుమార్లు రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని వినతిపత్రాలు అందించాం కానీ నేటి వరకు స్పందన లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అప్పంపల్లి గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించి, వచ్చే ఆదాయంతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలి.

- సంజన్నగారి వెంకట్‌రెడ్డి, రైతు

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

● ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ యోగేష్‌గౌతమ్ మంగళవారం తెలిపారు. జిల్లా పోలీసుల అనుమతులు లేనిదే ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించవద్దన్నారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే విధంగా జన సమూహాలు పూర్తిగా నిషేధించబడ్డాయన్నారు. సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలు, మతాల మధ్య చిచ్చురేపే అంశాలు వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆర్టీసీ లేబర్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నారాయణపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న మహిళా స్వీపర్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్న ఆర్టీసీ లేబర్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బల్‌రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేట ఆర్టీసీ డిపోలో డీఎం లావణ్యకు వినతిపత్రం అందించి, మాట్లాడారు. కార్మికులతో ఎక్కువ గంటలు పని చేయించి కేవలం రూ.6550 చెల్లిస్తున్నారన్నారు. పీఎఫ్ కార్మికుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలియజేయడం లేదన్నారు. కార్యక్రమంలో వెంకటమ్మ, సుశీలమ్మ, కిష్టమ్మ, గోవిందమ్మ, కాశమ్మ, భాగ్య, కిష్టమ్మ, భీమమ్మ, బస్సమ్మ, నాగేంద్రమ్మ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ధన్వాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జేసీబీ.రాజు కోరారు. మంగళవారం ధన్వాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం యువతీ యువకుల ఆర్థికాభివృద్ధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈనెల 14లోగా అర్హులు రేషన్‌కార్డును జతపర్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం జక్లేర్ గ్రామ ప్రధాన రహదారిపై మంగళవారం అంబలి కేంద్రాన్ని అయ్యలప్ప ప్రారంభించి, అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి చివరివరకు అంబలి కేంద్రం నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్మీకి ఎంపికైన యువకులకు సన్మానం

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అభంగాపూర్‌కు చెందిన కె.లక్ష్మీకాంత్, రహమాన్‌పాష ఆర్మీకి ఎంపిక కావడంతో గ్రామంలోని ఎల్లమ్మ కాలనీ వాసులు, మిత్రులు మంగళవారం వారిని శాలువాలతో సన్మానించారు. దేశానికి సేవ చేయడం అదృష్టమన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

» ఉప్పర్‌పల్లిలో గ్రామస్థుల ధర్నా » మిషన్ భగీరథ అధికారుల హామీతో విరమణ



ఉప్పర్‌పల్లి గ్రామ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న స్థానికులు

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం ఉప్పర్‌పల్లి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు మంగళవారం గ్రామ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. గ్రామంలో కొద్ది రోజుల నుంచి నీటి ఎద్దడి ఏర్పడిందని వాపోయారు. సోమవారం రాత్రి మోటార్ కాలిపోవడంతో మిషన్ భగీరథ నీరు సరిపోవడం లేదని, వెంటనే అన్ని వార్డుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ అధికారులు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

భూములు లాక్కోవడమే పనిగా పెట్టుకున్న రేవంత్ సర్కార్

» బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో జనాల వద్దకు వెళితే పొట్టుపొట్టున తిడుతుండడం వల్లే మూగజీవాలు ఉన్న ప్రాంతానికి వెళితే అవి ఎలాగో తిట్టలేవనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి సర్కార్ ఎలాగైనా సరే భూములు లాక్కోవడమే పనిగా పెట్టుకున్నట్లు ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న సంఘటన స్పష్టం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూ భూములను కాపాడుకునేందుకు వందల వంది విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తుంటే ప్రభుత్వం తరపున ఒక మంత్రి కానీ ఒక అధికారి కానీ యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవాల్సింది పోయి అక్రమంగా రాత్రికి రాత్రి వందల సంఖ్యలో బుల్డోజర్లను రప్పించి భూములను చదును చేసే పనులకు శ్రీకారం చుట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సంఘటనను అడ్డుకోబోయిన విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసి కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. రేవంత్‌రెడ్డి తీరు ఇలాగే కొనసాగితే ఇదే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిన్ను తెలంగాణ ప్రజలు, విద్యార్థులు రాబోయే రోజుల్లో ఫుట్‌బాల్ ఆడడం మాత్రం ఖాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు

» ఎస్ఐ అశోక్‌బాబు

మాగనూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నూతన బారికేడ్లను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన వాసవి జనరల్ స్టోర్ యజమాని రాంగోపాల్‌శెట్టి స్థానిక పోలీస్ స్టేషన్‌కు 6 బారికేడ్లను అందించారన్నారు. అలాగే ఎస్పీ కార్యాలయం నుంచి 5 బారికేడ్లు వచ్చాయన్నారు. మొత్తం 11 బారికేడ్లను నల్లగట్టు ప్రధాన రహదారిపై, బస్టాండ్ దగ్గర, పోలీస్‌స్టేషన్ ముందు వీటిని ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రూ.70 వేలతో 6 బారికేడ్లను అందించిన రాంగోపాల్‌శెట్టిని పోలీసులు అభినందించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమాజ సేవకు పాటుపడాలని వారన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అర్జున్, నీలయ్యగౌడ్, పోలీసులు, స్థానిక యూత్ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు : ఏఎస్ఐ



బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు

నారాయణపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. మంగళవారం నారాయణపేట పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. బ్రీత్ అనలైజర్‌తో డ్రంకెన్ డ్రైవ్ చేసి నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయన్నారు. మద్యం తాగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే కేసులు పునరావృతమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

యూనివర్సిటీ భూములు అమ్మొద్దు

» వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్

నారాయణపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మొద్దని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణపేట సీఐటీయూ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ భూములు, సంపదను కార్పొరేట్ బడా కంపెనీలకు అప్పజెప్పే విధానాన్ని మానుకోవాలన్నారు. యూనివర్సిటీ భూములను రక్షించేందుకు విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తే వారిపై పోలీస్ జులుం ప్రయోగిస్తు పోలీస్‌స్టేషన్‌లకు లాక్కెళ్లి నిర్బంధించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి యూనివర్సిటీ భూములను యూనివర్సిటీలకే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మొండిగా, నిరంకుశంగా ప్రభుత్వ ఆస్తులను బడా కంపెనీలకు దారాదత్తం చేస్తే గత పాలకులకు పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులు సరికావు

మద్దూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్థలం అమ్మకాన్ని వ్యతిరేకించేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రజల ఆస్తులను ప్రభుత్వాలు అమ్ముకోవడం సరికాదని ఆ సంఘం నాయకులు అశోక్, భీంపురం హన్మంతు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తు ప్రజా ఆస్తులను అమ్ముకుంటోందన్నారు.

యూనివర్సిటీకి ఇవ్వాలి..

మాగనూరు : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను యూనివర్సిటీకి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పుంజనూరు ఆంజనేయులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, సంపదను కార్పొరేట్ బడా కంపెనీలకు అప్పజెప్పే విధానాన్ని మానుకోవాలని సూచించారు. అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నయూం, సురేష్, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వీరభద్రస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



కొలువుదీరిన స్వామివారు

మక్తల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలో వీరభద్రస్వామి జాతర బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ప్రభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని చిన్నరథంపై ఊరేగించారు. రాత్రి 9 గంటలకు భజన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే బుధవారం సాయంత్రం 6 గంటలకు స్వామివారిని పెద్దరథంపై ఊరేగించనున్నామన్నారు. గురువారం సాయంత్రం 6 గంటలకు పల్లకీసేవ, భజనలు, కోలాటం నిర్వహించనున్నట్లు వారు వివరించారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

వీరభద్రస్వామి జాతర బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు శివయ్య, సంతోష్‌లు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ పట్టణంలో పురాతన ఆలయాలు అనేకం ఉన్నాయని, పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, కట్టసురేష్, బిల్డర్‌తాయప్ప, గోవర్ధన్, గుంతలి రవి తదితరులున్నారు.